# మూడు కోతులు

మూడేళ్ళ తరువాత మళ్ళీ ఈనాడు సినిమా హాల్లో ఆమెని చూడకపోతే ఆ సంగతి ఈ రోజు మా ఆవిడతో చెప్పకపోయేవాణ్ని— చెప్పి, ఆవిడగారి సాధింపులు, తిట్లు పడాల్సి వుండేదికాదు. సరే చూశాను. అయినా ఆవిడ సంగతి తెలిసీ ఈ మాట ఎందుకు చెప్పాలి నేను — అంటే బుద్ధిగడ్డితిని! నా బుద్ధి ఎప్పుడూ గడ్డి తింటూనే వుంటుంది. నేను పుత్త అనుమానం మనిషిని. నాది వక్రబుద్ధి. నా పచ్చకామెర్ల కళ్ళకి లోకం అంతా పచ్చగానే కన్పిస్తుంది. నాకు విశాల దృక్పథం లేదు – ఏది సహృదయంతో, సంస్కారంతో అర్థం చేసికోవడం చేతకాదు – సంకుచిత మనస్తత్వం — చదువున్నా సంస్కారంలేదు — ఇదంతా అన్నది ఎవరోకాదు సాక్షాత్తు నా అర్థాంగే – సాక్షాత్తూ శ్రీమతే అంటుంటే యిలా, నిజమేగాబోలు అని నాకే నా గురించి అనుమానం వస్తూంటుంది. మా ఆవిడ నన్ను సంస్కారినిచేసి, వక్రమార్గంనించి సన్మార్గంలోకి పెట్టే ప్రయత్నం – ఎప్పటి కప్పుడు నేను నోరు తెరిచి ఏదన్నా అన్నప్పుడల్లా వాతపెట్టినట్టు పై గుణాలన్నీ ఏకరువుపెట్టి నోరు మూయిస్తుంది. వుట్టి నోరు మూయించడమేకాదు – చెవులు, కళ్ళుకూడా మూసుకోవాలని రేడియోమీద పెట్టిన మూడు కోతుల బొమ్మ చూపిస్తుంది – ఆ బొమ్మ ప్రత్యేకం నా కోసమే కొని బెడ్‌రూములో కళ్ళు తెరిచేసరికల్లా కనపడేటట్టు రేడియోమీద పెట్టింది.

ఇంతకీ, పైన చెప్పిన నేరారోపణలన్నీ వుట్టినే ఏ భార్యనా్న ఎందుకు చేస్తుంది? అని మీ కనుమానం వస్తుంది — వస్తుందేమిటి? వచ్చే వుంటుంది. నేను చెప్పే యీ ఒక్క విషయం విని మీరు మా

ఆవిడతో ఏకీభవిస్తారో లేక ఆవిడే నామీద పుట్టి పుణ్యానికి ఈ నిందలు మోపిందో మీరే తీర్పు చెప్పండి.

ఏంలేదు. ఆ పధ్య అంటే మూడేళ్ళ క్రితం ఓసారి విజయనగరం నించి విజయవాడ వెడుతున్నాను — విశాఖపట్నంలో రైలాగాక ఓ దృశ్యం నన్నాకట్టుకుంది — రైలు ఆగిన పది నిమిషాలకి ఆదరాబాదరా ఓ జంట కంపార్టుమెంటు దగ్గరకి వచ్చారు. ఆ జంటని చూడగానే అందులో ముఖ్యంగా ఆమెని చూడగానే అబ్బ ఏం అందం అనుకోకుండా వుండలేరు ఎవరూ — పాతికేళ్ళుండవచ్చు — గులాబీ రంగులో ముట్టుకుంటే కందిపోయేంత నాజూగ్గా వుంది. అందానికితోడు ఆకర్షణీయంగా తయారైంది — తెల్లటిమెడలో పొడుగ్గా నల్లపూసల గొలుసు అందాన్నిస్తూంది. ఆమెకి తీసిపోనట్టు అతను చాలా పొడుగ్గా, బలంగా, ఆకర్షణీయంగా నవీన పద్ధతుల్లో తయారై వున్నాడు. వారిద్దరి పర్సనాలిటీ చూసి తెలుగువారుకాదేమో అన్పించింది. సూట్ కేసు ఒక్కటి మాత్రం అతను లోపలపెట్టి "సుజా, నీ బెర్తు యిదిగో" అన్నాడు. మాట విని తెలుగువాళ్ళని తెలిసి యిద్దరిని కుతూహలంగా చూసి చూడనట్టు గమనించసాగాను. ఆమె కిటికీ దగ్గర కూర్చుంది. అతను క్రిందికి దిగి కిటికీ దగ్గర నిలబడ్డాడు. మొహంలో ఎక్కడా సంతోషపు ఛాయలులేవు. చాలా దిగులుగా, బెంగగా మొహం అంతా కందిపోగా గొంతులో దుఃఖాన్ని బలవంతాన అదిమి పెడ్తున్నట్టు అతనివంక చూసింది. మాటిమాటికి గుటకలు మింగుతూ ఏదో చెప్పాలని చెప్పలేని దానిలా దీనంగా చూస్తూంది. అతను కిటికీ ఊచలు పట్టుకుని ముందుకువంగి చాలా అభిమానంగా అనురాగంతో, ఆరాధనతో ఆమెని చూస్తున్నాడు. వాళ్ళిద్దరి మధ్య మాటలు కరువైనట్టు ఏం మాట్లాడుకోవాలో అర్థంకానట్టు జీవితంలో యింక యిదే ఆఖరిసారి కలుసుకోడం అన్నట్టు, ఈ మిగిలిన కొద్దిక్షణాల జ్ఞాపకాలే భవిష్యత్తులో అపురూపంగా భద్రపరుచుకోవల్సిన జ్ఞాపకంగా — ఏదో వారిద్దరి చూపులలో భావం యిది అని చెప్పలేను — భాష కందని భావం యిద్దరి చూపులలో వుంది. అతను ఆమె చెయ్యి తన చేతిలోకి తీసుకున్నాడు — ఆమె అతని చేతిని రెండు చేతులతో పట్టు

కుంది ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటున్నారు. ఒకరి చేతిలో వకరి చేయి నలిగిపోతుంది – ఎడబాటన్నది సహించలేనివారిలా దైన్యంగా చూసుకుంటున్నారు. ఆ అమ్మాయి కళ్ళల్లో తడి – మగవాడయినా ఈ వియోగానికి తట్టుకోలేని వాడిలా అతను గొంతులో దుఃఖం అడ్డుపడ్డట్టుగా మాట్లాడలేక బాధపడకు అన్నట్టు ఓదార్పుగా తల ఆడించాడు. వాళ్ళిద్దరికి అది రైల్వే ప్లాట్‌ఫారమ్ అని, చుట్టూ మనుష్యులు వున్నారన్న సంగతే గుర్తులేనట్టు, గుర్తున్నా లెక్కచేయనట్టు కనిపించారు. ఆఖరికి రైలు కూసింది. యిద్దరూ ఉలిక్కిపడ్డారు. అయిపోయింది. అంతా అయిపోయింది లాభం లేదన్నట్టు గాభరాపడ్డారు – రైలు కదిలింది – ఆమె చాలా దీనంగా నీరు నిండిన కళ్ళతో అతనివంక చూసింది – అతను నిస్సహాయుడిలా చూస్తూ ఆమె చేయి వదలకుండా రైలు వెంబడి నడవ సాగాడు. “బెంగపడకు సుజా, వీలుచూసి రాయి వస్తాను” – అన్నాడు – ఆమె పెదాలు చిన్నగా వణికాయి. రైలు వేగం అందుకుంది. రైలుతో పాటు పరిగెడ్తున్నాడు. రైలు వేగం పుంజుకోడంతో ఆమె చెయ్యి అతని చేతిలోంచి జారిపోయింది. అతను రైలు వేగం అందుకోలేక వెనక్కి నిలబడిపోయాడు – తెప్పరిల్లి చేయి ఊపసాగాడు. ఆమె యింక ముందుకు వంగి కనబడినంతమేరా అలా చూసింది — రైలు ప్లాట్‌ఫాం దాటగానే అతను కనుమరుగవగానే నిస్సహాయురాలిలా కిటికీ కమ్మీకి తల ఆన్చి అలా నీరు నిండిన కళ్ళతో శూన్యంలోకి చూస్తూండిపోయింది.

అంతా చూసాక చాలా ఆశ్చర్యం అనిపించింది. ఆహా – ఎంత అన్యోన్య దంపతులు! ఆమె పుట్టింటికి వెడుతూంది గాబోలు! భార్యాభర్తలు ఆ స్వల్ప ఎడబాటు కూడా సహించలేని వారిలా తల్లడిల్లిపోయారు–ఒకరిపట్ల ఒకరికి అంత ప్రేమానురాగాలు వుండడం ఎంత అపురూపమైన విషయం! ఎంత అదృష్టం! మా ఆవిడ వుంది – ఎప్పుడైనా యిలా నా కోసం పరితపించిందా, ఆఖరికి మొదటిసారి పురిటికి పుట్టింటికేళ్ళేటప్పుడైనా ఇలా నా వియోగం సహించలేక బాధ పడిందా – ఎంతసేపు అప్పలమ్మ అర్ధరూపాయి బాకీ గురించి, ఆవకాయ జాడీ గురించి, చాకలాడి బాకీ షట్టుగురించి అప్పగింతలు పెడ్తూ మాట్లాడుతుంది

కాని—ఇలా మూగగా ప్రేమ కళ్ళలో కురిపిస్తూ చూసిందా — పోనీ మళ్ళీ మిమ్మల్ని చూడగలనో లేదో అని సినిమా డైలాగన్నా వల్లించి కంట తడి పెట్టిందా! (ఆడదానికి ప్రసవం పునర్జన్మ అంటారు కదండీ) నేనే ఇంక సంతోషంగా కనిపిస్తే ఆవిడెక్కడ నొచ్చుకుంటుందోనని రైలెక్కించి దిగులుగా మొహం పెట్టాను. అప్పుడైనా వోదార్చిందా — "ఎందుకలా ఆముదం తాగినట్టు మొహం పెట్టారు." అని గదమాయించి "చాల్లెండి నటన, ఇదంతా నా మీద ప్రేమ అని నమ్మేంత వెర్రి లేదు లెండి. ఓ నాలుగైదు నెలలు హాయిగా సినిమాలు, షికార్లు, పేకాట సాగించవచ్చునని సంతోషంగానే వుందిలెండి మీకు" అంటూ దెప్పింది. ఇలా యింత అన్యోన్యంగా దంపతులుంటారని నవలల్లో, సినిమాల్లో చూడడమే కాని ప్రత్యక్షంగా ఈ రోజే చూశాను. వాళ్ళిద్దరిని చూశాక చాలా అసూయ అన్పించింది. పాపం ఆమె తన దుఃఖం, బాధ యితరులు చూడడం యిష్టంలేక గాబోలు పుస్తకం మొహానికి అడ్డుగా పెట్టుకుంది — కాని ఆమె చూపులు అలా వెనక్కే వున్నాయి అని తెలిసిపోతుంది.

అలా ఆలోచిస్తుంటే అంతలోనే మా ఆవిడ అనే నా వక్రబుద్ధికి ఆలోచన వచ్చింది. వాళ్ళిద్దరూ భార్యాభర్తలు అయి వుండరన్న పాడు అనుమానం తొంగి చూసింది. భార్యాభర్తలయితే యింత అన్యోన్యత వుంటుందా, అన్యోన్యత వున్నా పెళ్ళాం ఏ పుట్టింటికో వెడ్తుంటే ఆ స్వల్ప వియోగానికి యింతలా తల్లడిల్లిపోతారా! అంత ఒకరిని వదలి ఒకరు వుండలేనివారు ఇద్దరూ కలిసే వెడ్తారు అవకాశం చూసుకుని — మొగుడయితే రోజూ వుండే మొగుడికోసం యింక కనపడడన్నట్టు అంత ఏడుపు ఎందుకుంటుంది ఆమెకి. ఎంత అన్యోన్య దంపతులైనా విడిచి వెళ్ళడానికి కాస్త బెంగ అన్పించవచ్చుగాని ఇలా ఈ అవకాశం మళ్ళీ దొరకదన్న భయం కళ్ళల్లో ఎందుకు కన్పిస్తుంది. నా అనుమానం ఆలోచిస్తున్నకొద్దీ దృఢపడింది. వాళ్ళిద్దరూ ప్రేయసీ ప్రియులే! ఆ అమ్మాయికి యిష్టంలేని పెళ్ళి జరిగివుంటుంది. ఏ పుట్టింటికో వచ్చి పాత ప్రియుడిని కలుసుకుని వుంటుంది. అందుకే యిద్దరు యింత బాధపడుతున్నారు. అంతే. అదే నిజం.

అదేం ఖర్మ మా ఆవిడ అన్నట్టు నా కళ్ళకన్నీ యిలాంటివే కనిపిస్తాయి. కన్పించినా వాళ్ళిద్ధరూ దంపతులు కారన్న అనుమానం ఎందుకు రావాలి ఇదేకాదు ఏ సినిమాలోనో ఏ జంటో కనిపిస్తే వాళ్ళిద్దరి గురించి మొగుడు పెళ్ళాలు కాదేమో అన్పిస్తుంది. ఏ రైల్లోనో ఎవరినో చూస్తే లేచిపోతున్న వారిలా కన్పిస్తుంది. మహా మోడరన్‌గా కనిపించేవాడు, నా కళ్ళకి ఏదో పెద్ద స్మగ్లర్ బ్లాక్‌మనీ దాచినవాడే అన్పిస్తుంది. ఒక రకం ఆడవాళ్ళని చూడగానే బజారు సరుకు అనిపిస్తుంది. ఇంకొకరిని చూస్తే గంపగయ్యాళి అంటాను – రైల్లో ఎవరన్నా కలిసి మాట్లాడితే మాటల్లో వాళ్ళు ఎలాంటి వ్యక్తులో వూహించి చెప్తాను. నా ఈ ఊహలన్నీ వక్రబుద్ధి కనక తట్తాయని తనకేం తట్టవని మా ఆవిడ అంటూ సజావుగా ఎవరి గురించి ఆలోచించే సహృదయత లేదని తిడ్తుంది.

ఆవిడ అలా అంటుందని తెలిసి ఈ రోజు మూడు సంవత్సరాల తర్వాత సినిమాలో కన్పించిన ఆమెని గురించి నా అనుమానం ఎందుకు చెప్పాలి? ఆమెని ఆమె వెంటవచ్చిన అతన్ని చూశాక నాది అనుమానం కాదని దృఢపడ్డాక ఈసారన్నా నేను పుట్టి అనుమానం మనిషిని కాదన్న విషయం నిరూపించడానికి మా ఆవిడతో ఈ విషయం చెప్పాను.

అసలేం జరిగిందంటే—నేను ఆవిడ సినిమాకి వెళ్ళాం. ఇంకా లైట్లారలేదు. అంతలో హాలులోకి వచ్చిన ఓ జంటని చూశాను — జంటలో ఆ స్త్రీని చూడగానే ఎక్కడో చూసిన మొహంలా కన్పించింది. ఎక్కడ చెప్మా అని ఆలోచించేలోగానే వాళ్ళు వచ్చి మా ముందు కూర్చున్నారు. ఆమె యెంత అందంగా వుందో అతనంత వికారంగా నలుపు, బట్టతల, పొట్టతో అసహ్యంగా వున్నాడు. కాకి ముక్కుకు దొండపండన్నది ఎవరికైనా అనిపిస్తుంది. అతని చేతిలో ఓ, రెండు మూడేళ్ళ ముద్దులు మూటకట్టే పిల్లవాడున్నాడు. ఆమెని, ఆమె అందాన్ని చూడగానే అట్టే ప్రయత్నం లేకుండానే మూడేళ్ళక్రితం రైల్లో విశాఖపట్నంలో ఆమెని చూసిన గుర్తు వచ్చింది. గుర్తు రాగానే చాలా కుతూహలంగా ఆమెని గమనించాను. ఇదివరకుకంటె కొస్త వళ్ళు వచ్చి

నిండుగా ఉండడం మినహా ఆమెలో లావణ్యం ఏమీ తగ్గలేదు. నన్ను చూసి ఒక్క క్షణం ఆమె కళ్ళు ఆశ్చర్యంగా కదిలాయి. అంతలో మళ్ళీ ఆమె మామూలుగా చూపు మరల్చుకుంది. మాటలు, నడక వచ్చిన ఆ పిల్లాడు చాలా ముద్దుగా, తెల్లగా, బొద్దుగా వున్నాడు. తల్లిపోలిక వచ్చిం దేమో—తల్లి పోలికా ? కాదు. ఎవరిదో చూసిన పోలిక కన్పించింది. ఆ—ఆ రోజు రైల్లో చూసిన అతని పెదాలవంపు ఆ కళ్ళు అన్నీ అతనివే స్పష్టంగా పోలిక కన్పించింది—తండ్రి పోలిక అన్నమాట....ఆ రైల్లో అతను తండ్రి అయితే యితనెవరు ? ఏ అన్నదమ్ముడో గాబోలు ! ఆ ఒక్క క్షణంలోనే లక్ష అనుమానాలు చోటు చేసుకున్నాయి—నా అనుమానాన్ని నివృత్తిచేస్తూ ఆ పిల్లాడు అటుగా వచ్చి అమ్మా చాక్లెట్లని చూపిస్తూ "డాడీ....చాక్లెట్లు కొను డాడీ !" అని మారం చేశాడు. ఆమె "వద్దండీ. బట్టలన్నీ పాడు చేసుకుంటాడు—కొనకండి" అంది—

అతను "మమ్మీ వద్దంటుందిరా .... మరి" అంటూ మారాం చేస్తున్న కొడుకుతో అంటున్నాడు. ఆ మాటలు వినగానే నా సందేహం పటాపంచలమైంది. అబ్బ ఎంతకి తెగించిన ఆడది అనుకున్నాను. నా చూపులు గమనించి ఆవిడ అందాన్ని చూస్తున్నాననుకుని మా ఆవిడ కొర కొర చూసింది. "చూడు—ఆవిడని చూడు" అన్నా మెల్లగా.

"ఆ చూశా ? చాలా అందంగా వుంది లెండి" అంది ఉక్రోషంగా.

"అది కాదు ఆమెని, పిల్లలిని, అతన్ని బాగా చూడు ఇంటికెళ్ళాక ఓ గమ్మత్తు చెప్తాను" అన్నాను — ఇంతలో లైట్లారి సినిమా ఆరంభ మయింది—

ఇంటికి వచ్చి భోజనంచేస్తూ మూడేళ్ళ క్రితం రైల్లో జరిగిన సంగతి ఈ రోజు వాళ్ళిద్దరిని చూసిన నా అనుమానం ఎలా దృఢపడింది చెప్పాను "నిజంగా ఎంత ధైర్యం ఆమెకి. భర్త చాటున ఎంత నాటకం ఆడుతుంది—ఆ పిల్లాడు అచ్చు అతని పోలికే — నిజంగా అసలు ఆ రోజే అనుమానం వచ్చింది వాళ్ళ వరస చూస్తే" అన్నాను.

అంతే. ఆవిడ కొరకొర చూసి "ఎందుకలా పెడర్థాలు తీస్తారు. వాళ్ళిద్దరూ ప్రేయసీ ప్రియులే అని ఎవరు చెప్పారో తమకి — ఏ అన్నా చెల్లెలు అవకూడదా ఏమిటి—ఎప్పుడూ యిలాంటి ఆలోచనలే మీకు. ఓ ఆడది మగాడు కలిసి కనిపిస్తే యిద్దరికీ ఏదో వుందనేనా ఏమిటి అర్థం...." ఆవిడ దండకం చదివింది.

"హతోస్మి — వాళ్ళిద్దరూ అన్నా చెల్లెళ్ళా? — అన్నా చెల్లెళ్ళయితే అలా మూగగా కళ్ళతో మాట్లాడుకోడం, చేతులు పిసుక్కోడం. కన్నీళ్ళు కార్చడం, అంతలా బెంగపడిపోవడం యిదంతా అన్నా చెల్లెళ్ళు ఒకరిని వదలలేక ఒకరు బాధపడడమా....

"ఏం ఎందుకుండరు? అన్నా చెల్లెళ్ళ అనురాగం మీకేం తెలుసు" ఓ విసురు విసిరింది. నాకు అక్కా చెల్లెళ్ళు లేరులెండి. "ఓహో .... అన్నా చెల్లెళ్ళ అనురాగాలు అలా వుంటాయన్నమాట. ఒకరి నొకరు గాఢంగా కౌగలించుకోడం, ఒకరి కళ్ళలోకి ఒకరు మైమరచి చూసుకోడం, ఒకరికోసం ఒకరు ఎంతెంత త్యాగాలు చేసుకోవడం, అన్నయ్యా నన్ను కన్నయ్యా అని చెల్లెలు, చెల్లెమ్మా నన్ను కన్నమ్మా అని డ్యూయట్లు పాడడం యింకా యిదంతా సినిమాలలోనే అనుకున్నాను. నిజంగా కూడా అలా వుంటారన్న మాట. అయితే మరి మీ అన్నయ్య కౌగలించుకోటం అటుంచి కనీసం అభిమానంగానైనా కళ్ళలోకి చూడడేం మరి...." నంచు చూసి దెప్పాను. శ్రీమతిగారి మొహం ఎర్రబడింది. ఉక్రోషంగా "చెప్పక్కర లేదులెండి. అయ్యో రాత మా అన్నలాగే లోకంలో అన్నలుంటా రేమిటి? వాడి కెంతసేపు పెళ్ళాం తప్ప చెల్లెలెక్కడ గుర్తు — మా అన్న లేడని అందరన్నలూ అలాగే వుంటారా? ఏ అన్నా చెల్లెలని చూసినా ముచ్చట వేస్తుంది. వాళ్ళిద్దరూ తప్పకుండా అన్నా చెల్లెళ్ళే అయి వుంటారు — పిల్లాడికి మేనమామపోలిక వచ్చివుంటుంది. మీ కలా కనపడడంలో వింతేం లేదులెండి.

ఆ బుద్ధి అలాగే పని చేస్తుంది మరి'' అంటూ హేళనగా దెప్పి చేయి కడుక్కోడానికి లేచింది.

ఆవిడ అంత ఖచ్చితంగా చెప్తుంటే వాళ్ళిద్దరూ అన్నా చెల్లెళ్ళు కాదని యింకెలా అంటాను! నిజంగా వాళ్ళిద్దరే అన్నా చెల్లెళ్ళయితే మన సినిమాలు రియలిస్టిక్‌గా వుండవన్న వాళ్ళని తుపాకిపెట్టి కాల్చేయాలి మరి!

అయినా నా కెందుకు అనుకుంటూ మూడు కోతుల్ని చూశాను.